17 వ
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
గురువారం,18 ఏప్రిల్ 2024



# 27 మంది వాలంటీర్ల రాజీనామా

## అభినందించిన ఆళ్లనాని



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రజలకు సంక్షేమం దూరం చేసేందుకు కుటిల బుద్ధితో చంద్రబాబు కూటమి వాలంటీర్ల పై లేని పోని ఆరోపణలు,అభండాలు వేస్తూ వాలంటీర్లను కించ పరుస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ళ నాని ఆరోపించారు. బుధవారం శ్రీరామ్ నగర్,ఎమ్.ఎల్.ఏ.క్యాంప్ కార్యాలయంలో 29 డివిజన్‌కు చెందిన 27 మంది వాలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసి, ఎమ్.ఎల్.ఏ. క్యాంప్ కార్యాలయంలో ఎమ్.ఎల్.ఏ. ఆళ్ల నానిని కలసి సి.ఎమ్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మద్దతుగా తాము రాజీనామా చేసినట్టు తెలిపారు.ఈ సందర్భంగా స్వచ్ఛందంగా రాజీనామా చేసిన వాలంటీర్లనుద్దేశించి ఆళ్ల నాని అభినందించారు. వాలంటీర్ల స్వచ్ఛంద రాజీనామా వారి త్యాగం,సాహసాన్ని నాని ప్రసంశించి, రానున్న ప్రభుత్వంలో జగన్ మోహనరెడ్డి మళ్ళీ ముఖ్య మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే వాలంటీర్ వ్యవస్థ పునరుద్దరణ చేసి ఊహించని రీతిలో వాలంటీర్ల జీవితాలు మెరుగు పడే విధంగా రూపకల్పన చేస్తారని, ఆళ్ల నాని భరోసా ఇచ్చారు.

# నేటి నుండి నామినేషన్ల స్వీకరణ

**-జిల్లాలో 16.34 లక్షల మంది ఓటర్లు - 1744 పోలింగ్ స్టేషన్లు**
**-ప్రశాంత ఎన్నికలకు పార్టీలు, ప్రజలు, మీడియా సహకరించాలి**
**-జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్**



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రజాస్వామ్య పండగ సార్వత్రిక ఎన్నికలులో భాగంగా ఈనెల 18వ తేదీ గురువారం నుండి నామినేషన్ స్వీకరణకు సర్వం సిద్ధం చేశామని,ప్రశాంత ఎన్నికలకు పార్టీలు,ప్రజలు, మీడియా సహకరించాలని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు.ఎన్నికల ఏర్పాట్లు నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి,జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి,డిఆర్‌ఓడి.పుష్పమణిలతో కలిసి పాత్రికేయులసమావేశంలో తెలియజేసారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈనెల 18వ తేదీన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని,అదే రోజు నుండి నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు.ఈనెల18వ తేదీ నుండి 25వ తేదీ వరకు కార్యాలయ పనిదినాలలో ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తారన్నారు. 26వ తేదీన నామినేషన్లను పరిశీలించడం జరుగుతుందని,నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ ఏప్రిల్,29వ తేదీ అని,అదే రోజు నామినేషన్ల తుది జాబితా వెలువరించడం జరుగుతుందన్నారు. మే 13వ తేదీన పోలింగ్ జరుగుతుందని,జూన్,4వ తేదీ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. జిల్లాలో 16.34 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, పోలింగ్ నిమిత్తం 1744 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు గరిష్టంగా 4 సెట్ల నామినేషన్ దాఖలు చేయవచ్చన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి నామినేషన్ దరఖాస్తుకు 25 వేల రూపాయలు, అసెంబ్లీ నియోజకవర్గానికి దరఖాస్తు 10 వేల రూపాయలు డిపాజిట్‌గా చెల్లించవలసి ఉంటుందన్నారు. షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికి 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఎన్నికల సందర్భంగా అంతర రాష్ట్ర సరిహద్దుల వద్ద 8 చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విస్తృత తనిఖీల ద్వారా 13. 17 కోట్ల రూపాయల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం జరిగిందన్నారు. నామినేషన్లు దాఖలుకు చివరి తేదీ అనంతరం పోస్టల్ బ్యాలెట్ పత్రాలు జారీ చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఇంటింటికి ప్రచారాన్ని ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే చేయాలన్నారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూప్రజలుస్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు.జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి మాట్లాడుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహణకు అనుమతులు తీసుకోవాలని, కార్యక్రమాలనుపాఠశాలలు,మతపరమైనప్రదేశాలలో నిర్వహించకూడదన్నారు.





# టిడిపి ఆద్వర్యంలో ఎస్సీ,ఎస్టీల ఆత్మీయ సమావేశం

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం ఎస్సీ ఎస్టీల ఆత్మీయ సమావేశంలో ఏలూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, ఏలూరు అసెంబ్లీ కూటమి అభ్యరి బడేటి రాధాకృష్ణయ్య (చంటి),జనసేన నేత రెడ్డిఅప్పలనాయుడు పాల్గొన్నారు.ఏలూరులోని స్థానికపొగాకు మర్చంట్ కళ్యాణమండపంలో బుధవారం జరిగిన ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాల ఎస్సీ ఎస్టీల ఆత్మీయ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు,ఎస్‌సిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ సమావేశానికి సారధ్యంవహించారు.ఏలూరుపార్లమెంట్‌పరిధిలోని7అసెంబ్లీ నియోజకవర్గాలనుండి పలువురు పాల్గొన్నారు.

## కలిసి పని చేయండి .. మాజీ మంత్రి పితాని





**నర్సాపురం,మేజర్‌న్యూస్:** తెలుగుదేశం, బిజెపి బలపర్చిన జనసేన పార్టీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌ను అందరూ కలిసికట్టుగా పనిచేసి గెలిపించాలని మాజీ మంత్రి, తెలుగుదేశంపొలిట్ బ్యూరో సభ్యులు పీతాని సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక తెలగా కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ జెడ్పిటిసి కుక్కల మీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో పితాని మాట్లాడుతూ వైశ్యామ్యాలు వీడి ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ తరఫున కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు, పొత్తూరి రామరాజు, బండారు మాధవ నాయుడు పార్టీ టికెట్లు ఆశించారని, జనసేన నుండికొత్తపల్లి సుబ్బారాయుడు ఆశించినప్పటికీ మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా బొమ్మిడి నాయకర్ ను అధిష్టానం నిర్ణయించినట్లు తెలిపారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసంకృషి చేయాలన్నారు. పార్లమెంట్ అభ్యర్థిగా బిజెపికి చెందిన శ్రీనివాస వర్మను పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు ఒక ఓటు గ్లాసు గుర్తుకు, మరొక ఓటు కమలం గుర్తుకు వేయాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడుకు చంద్ర బాబు నాయుడు ఎన్నికల అనంతరం తగినగుర్తింపు ఇస్తామని చెప్పినట్లు పితానివెల్లడించారు.ఈ సమావేశంలో బండారు మాధవ నాయుడు, బొమ్మిడి నాయకర్, బిజెపి నాయకులు పాక సత్యనారాయణ, చిన మిల్లి సత్యనారాయణ రావు, తదితరులు మాట్లాడారు. అనంతరం బండారు మాధవ నాయుడు ఆధ్వర్యంలో పితాని, పాక, నాయకర్ లను సత్కరించారు.

## నామినేషన్లు స్వీకరించే కంద్రాలు -రిటర్నింగ్ అధికారులు

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లు జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ నామినేషన్లు స్వీకరిస్తారు. 64- దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి దెందులూరు తహశీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి,జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి నామినేషన్లు స్వీకరిస్తారు. 67-పోలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి కోటరామచంద్రాపురం ఐటిడిఎ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి,ఐటిడిఎ పివో యం.సూర్యతేజ నామినేషన్లు స్వీకరిస్తారు.63-ఉంగుటూరుఅసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి ఉంగుటూరు తహశీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి,ఏలూరుఆర్డిఓఎన్ఎస్ కె.ఖాజావలి నామినేషన్లు స్వీకరిస్తారు.65-ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏలూరు కోటదిబ్బలోని తహశీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.ముక్కంటి నామినేషన్లు స్వీకరిస్తారు. 68- చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి చింతలపూడి తహశీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి,జంగారెడ్డిగూడెంఆర్డిఓ కె.అద్దయ్య నామినేషన్లు స్వీకరిస్తారు.70-నూజివీడుఅసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి,ఆర్డిఓ వై.భవానీశంకరి నామినేషన్లు స్వీకరిస్తారు. 73- కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి కైకలూరు తహశీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ నామినేషన్లు స్వీకరిస్తారు.

# నేటి నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం



**భీమవరం,మేజర్‌న్యూస్:** ఈ నెల 18 గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని, అదే రోజు నుండి అభ్యర్థుల ఖాతాలో ఖర్చు లెక్కించబడుతుందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సుమత్ కుమార్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గరనుంచివారిఖాతాలోఖర్చు నమోదుచేయడం జరుగుతుందన్నారు. సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలు, జెండాలు, బ్యానర్లు,పోస్టర్లు, వినియోగి స్తున్న వాహనాలు,ఏజెంట్లకు పెట్టే భోజనాల ఖర్చు సైతం అభ్యర్థిఖాతాక్రిందకే వస్తాయన్నారు. పార్ల మెంటు, అసెంబ్లీ అభ్యర్థులు ఇద్దరూ ఉమ్మడిగా సమావేశాలు, సభలు నిర్వహిస్తే,ఆఖర్చునుఇద్దరికీ సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాకు ముగ్గురు అధికారులను వ్యయ పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమించిందని, ఒకరు పార్లమెంటుకు,మిగిలిన ఇద్దరు అసెంబ్లీనియోజక వర్గాలకు వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారన్నారు. సభలు, సమావేశాలు జరిగిన 24 గంట్లలోగానే అభ్యర్థి ఖాతాలో ఖర్చు నమోదు చేయాలనిసంబంధిత సిబ్బందికి సూచించడం జరిగిందన్నారు. నామినేషన్ వేసిన దగ్గరనుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే రోజు వరకూ అభ్యర్థి చేసే ఖర్చు అతని ఖాతాలోనే జమ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

పార్లమెంట్ నియోజకవర్గానికి నామినేషన్ వేసే అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.25 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.అసెంబ్లీ నియోజక వర్గానికి నామినేషన్ వేసే అభ్యర్థులు రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గాలలో 50 శాతమే డిపాజిట్ ఉంటుందన్నారు.

# బీసీల అభివృద్ధి అంటే వైసిపి నాయకులకు ఈర్ష్య



**ఏలూరు, మేజర్ న్యూస్:** బీసీ వర్గం అంటే వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి సునీల్ కుమార్‌కు చులకనగా ఉందని సంఘ నాయకులు మండిపడ్డారు. బుధవారం స్థానిక గ్రాండ్ ఆర్య హెూటల్ నందు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘ నాయకులు మాట్లాడుతూ గౌడ సంఘ ఆత్మీయ సమ్మేళనంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్‌డిఏ కూటమి పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ కి నాయి బ్రాహ్మణులు, గౌడ సంఘ నాయకులు అన్ని కులస్తులకు కళ్యాణ మండపాలు ఉన్నాయని, తమకు ద్వారకా తిరుమల దేవస్థానంలో తమకు ప్రత్యేకంగా కళ్యాణ మండపం ఏర్పాటు చేయాలని గౌడ, నాయి బ్రాహ్మణ నాయకులు కోరారు.ఈ విషయమై పుట్టా మహేష్ యాదవ్ స్పందిస్తూ తన ట్రస్టు ద్వారా సొంత డబ్బులు తో కళ్యాణ మండపం నిర్మిస్తానని హామీ ఇచ్చారు.దీనిపై ఏలూరు పార్లమెంటు వైసిపి అభ్యర్థి కారుమూరు సునీల్ కుమార్ రాజకీయ విమర్శలు చేయడం సరికాదని మండిపడ్డారు.బీసీలకు మీరు ఏం హామీలు ఇచ్చారో చెప్పండి అంటూ కారుమూరు సునీల్ ని సంఘ నాయకులు ప్రశ్నించారు.పుట్ట మహేష్ యాదవ్ ఆయన సొంత డబ్బులతో కళ్యాణ మండపం నిర్మిస్తానని చెప్పారు గానీ పార్లమెంటు నిధులతో నిర్మిస్తానని చెప్పలేదని అన్నారు. కారుమూరు సునీల్ కు భయం ఏర్పడి ఏం మాట్లాడుతున్నారో తెలియట్లేదు అని నాయి బ్రాహ్మణ గౌడ సంఘం నాయకులు ఏద్దేవ చేశారు. ఓటమి భయంతోనే ఇలాంటి విమర్శలకు పాల్పడుతున్నారని రాష్ట్రంలో ఉన్న బీసీ వర్గం అంతా టిడిపి, బిజెపి, జనసేన బలపరిచిన కూటమి అభ్యర్థులను గెలిపించుకునే తీరుతారని,బీసీల తడాఖా చూపిస్తామని హెచ్చరించారు

## శ్రీరామనవమి వేడుకల్లో

# పట్టు వస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు సమర్పించిన గారపాటి దంపతులు





**చింతలపూడి,మేజర్‌న్యూస్:** చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి మక్కినవారిగూడెం సమీపంలోని రాముని గట్టు శ్రీరామ రామలింగేశ్వర స్వామి ఆలయంలోనిర్వహించినశ్రీ సీతారాముని కళ్యాణ మహెూత్సవంలో తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి,రేణుక దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజ కార్యక్రమలలో పాల్గొన్నారు. శ్రీరామనవమి నాడు ఎంతో ప్రసిద్ధి చెందిన రాముడు గట్టు స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొటం తన అదృష్టంగా భావిస్తున్నాను అని గారపాటి చౌదరి అన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని తిలకించి అనంతరం నిర్వహించిన అన్నదానంలో స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వివిఎస్‌శాస్త్రి, ఉపాధ్యక్షులు పద్మనాభశాస్త్రి, కోశాధికారి సోమశేఖరా ఆచార్యులు, చింతలపూడి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఏసుప్రభు, సోమశేఖర్ పాల్గొన్నారు.

# శ్రీరామనవమి వేడుకల్లో పుట్టా మహేష్ యాదవ్



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు పట్టణం శనివారపుపేటలో శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో ఏలూరు టిడిపి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ పాల్గొన్నారు. స్వామి వారి పూజ కార్యక్రమంలో,అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీతా రాముల కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:** శ్రీరామనవమి సందర్భంగా బుధవారం బుట్టాయిగూడెం మండలం దుద్దుకూరు గ్రామంలో సీతారాముల కళ్యాణంలోశాసన సభ్యులు తెల్లం బాలరాజు,ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఇరువురు ముందుగా అందరికి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీతారాముల కళ్యాణం జరిపించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.నియోజకవర్గంలోనిప్రజలందరూ ఆయురారోగ్యాల తో,అష్ట ఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో సుబిక్షంగా ఉండాలని కోరుకున్నారు,ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు,పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి పెద్ద సంఖ్యలో జనసేనలో చేరిక



**కామవరపుకోట,మేజర్‌న్యూస్:** కామవరపుకోట మండలం తూర్పు యడవల్లి పంచాయతీ నల్ల గోపవారిగూడెం గ్రామం లో వైసీపీ పార్టీ నుంచి జనసేన పార్టీ లోకి 450 మంది భారీ గా చేరారు. ఈ సందర్భంగా చింతలపూడి టిడిపి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ మాట్లాడుతూ జనసేన పార్టీ లోకి మిమ్మల్ని ప్రేమ పూర్వకంగా ఆహ్వానిస్తున్నానుఅంటూ మనందరం కలిసి చంద్రబాబు ని ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాము అని పిలుపునిచ్చారు. వైసీపీ పార్టీ మోసపూరిత పార్టీఅని,ఈ జగన్ మోసపురెడ్డి చేసే అరాచకాలు,అన్యాయాలు చూసి భరించలేక విసుగు చెంది జనసేన అధినేత నిస్వార్థ పరుడు, ప్రశ్నించే గుణం ఉన్న నిజమైన నాయకుడు పవన్ కళ్యాణ్ ఆలోచన లు, వారి సిద్ధాంతాలు నచ్చి పార్టీ లోకి రావడం జరిగిందని జనసైనికులు మాట్లాడారు.ఈ కార్యక్రమానికి చింతలపూడి నియోజకవర్గ జనసేన అధ్యక్షులు మేక ఈశ్వరయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ టైగర్ కరాటం రాంబాబు,టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులు, భారీ సంఖ్యలో జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

## నలుగురు నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదు - రిమాండ్



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** జంగారెడ్డిగూడెం పోలీసులు నేర ప్రవృత్తి గల వారిపై ఉక్కుపాదం మోపారు.జంగారెడ్డిగూడెం, చుట్టుపక్కలపరిసర ప్రాంతాలలో గత కొంతకాలంగా హత్య, హత్యయత్నం,దారిదోపిడి, కిడ్నాప్ లాంటి పలు నేరాలకు పాల్పడుతున్నారు. జైలుకు వెళ్లి బెయిల్ పై బయటికి వచ్చి తిరిగి మరల నేరాలకు పాల్పడుతూ ఉండడంతో నలుగురు నేరస్తులపై జిల్లా ఎస్పీ కలెక్టర్ ఆదేశాల ప్రకారం పీడీ యాక్ట్ నమోదు చేసి రాజమండ్రి కేంద్ర కార్యాలయానికి తరలించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని డిఎస్పీ రవిచంద్ర హెచ్చరించారు.

# వైభవంగా సీతారాముల కళ్యాణం

**పెదవేగి,మేజర్‌న్యూస్:** శ్రీరామ నవమిని పురస్కరించుకుని పెదవేగి మండలంలో వాడవాడలా సీతారాముల సల్యాణం వైభవంగా నిర్వహించారు. వదూ వరులుగా మారిన సీతారాములకు భక్తిశ్రద్ధలతో కళ్యాణం చేయించారు. దుగ్గిరాలలో జరిగిన కళ్యాణ వేడుకలో పాల్గొన్న దెందులూరు మాజీఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీరాముడు అదిరించిన జీవన విధానం సర్వమానవాళికి ఆదరణీయమన్నారు. శ్రీరాముడు అంటేనే కరుణ, దయ, నీతి, నియమ నిష్ఠలు సత్యమని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటే సర్వ మానవాళి సుఖసంతోషాలతో ఉంటుందని చెప్పాడు. శ్రీరామనవమ్ని ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు, సుఖసంతోషాలను అందించాలని ఆయన అందించారు.



# 19న ముదునూరి నామినేషన్ .. కొల్లా బత్తుల

**నరసాపురం,మేజర్‌న్యూస్ :** ఈనెల 19న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు నామినేషన్ దాఖలు చేస్తారని,ఈ కార్యక్రమాన్ని వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు విజయవంతం చేయాలని పశ్చిమగోదావరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కొల్లా బత్తుల రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొగల్తూరు మండలం పాతపాడు గ్రామం నుండి భారీ ర్యాలీగా బయలుదేరి ముత్యాలపల్లి మొగల్తూరు సీతారాంపురం మీదుగా నరసాపురం సబ్ కలెక్టర్ ఆఫీస్ కు ర్యాలీ చేరుకుని నామినేషన్ దాఖలు చేస్తారని ఆయన తెలిపారు.



# మంచినీటి కొరతతో అల్లాడుతున్న తక్కెళ్ళపాడు ప్రజలు





**-చెరువులోని చేపలు చనిపోయి మురికివాసన**

**-స్పందించని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు,మంచి నీటి స్కీమ్ కాంట్రాక్టర్లు**

**-గ్రామ ప్రజల దాహార్తి తీర్చడం ఎలా? - సర్పంచ్ ఆవేదన**

**మండవల్లి,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలంలోని కొల్లేటి ప్రజలు మంచి నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరలోనికి వెళ్తే మండవల్లి మండలం తక్కెళ్ళపాడు గ్రామంలోని మంచినీటి చెరువులో చుక్క నీరు కూడా లేదు. సిపిఎస్ స్కీమ్ ద్వారా తక్కెళ్లపాడు నుంచి అనేక గ్రామాలకు మంచినీటిని సరఫరా చేయవలసి ఉంది.ఐతే ఈ వేసవి కారణంగా గ్రామంలోని ప్రజలుమంచి నీటికొరతతో అల్లాడుతున్నారు. తక్కెళ్లపాడులోని మంచి నీటి చెరువులో నీరు లేక చేపలు చనిపోయి మురుగు వాసన వస్తుంది.గ్రామ సర్పంచ్ వెను వెంటనే రక్షిత మంచినీటి సరఫరా అధికారులకు ఫోన్ చేయగా వారి వద్ద నుంచి ఏటువంటి స్పందన లేదు.సీపీఎస్ కాంట్రాక్టర్ ను సంప్రదించగా వారి వద్ద నుంచి కూడా ఎలాంటి సమాధానం రాకపోవడంతో గ్రామ సర్పంచ్ అయిన చేబ్రోలు మసీలమణిదగ్గరఉండి మంచి నీటి చెరువును శుభ్రం చేయిస్తున్నారు.ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సుమారు 3000వేలు పైగా జనాభా ఉంటే మంచి నీరు లేక ఇబ్బంది పడ్తున్నారు అని ఆయన వాపోయారు.తన గ్రామంలోని ప్రజల దాహార్తిని తీర్చడం ఎలా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మంచి నీటి సమస్య తీర్చాలని, స్కీమ్ ద్వారా అనేక పక్క గ్రామాల నీటి ఎద్దడి కూడా తీరుతుంది అని ఆయన తెలిపారు.

# ఎన్డీఏ అభ్యర్థి బొలిశెట్టిని గెలిపిద్దాం



**పెంటపాడు, మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొలిశెట్టి శ్రీనివాసును భారీ మెజార్టీతో గెలిపించాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి కోరారు. పెంటపాడు లో బుధవారం నిర్వహించిన పల్లెపోరు కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఈతకోట తాతాజీ, జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ లతో కలిసి ఇంటింటికీ కూటమి ప్రజలకు అందించే పథకాలను వివరించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ తాము ప్రజలకుసేవచేయాలనేఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చామని రాజకీయాన్ని వ్యాపారంగా చేసే నాయకులను తరిమికొట్టాలని తాడేపల్లిగూడెంలో కొట్టు సత్యనారాయణ అవినీతి పాలన కి అటు జగన్మోహన్ రెడ్డి పాలనకి చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో టిడిపి జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలకు తాము అండగా ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

# నేడు ఆళ్లనాని నామినేషన్‌కు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు తరలి రావాలి



**ఏలూరు,మేజర్‌న్యూస్:**వైఎస్సార్సీపీఏలూరు జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆళ్ల నాని నామినేషన్ వేస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు పెద్ద సంఖ్యలోవచ్చిఆశీర్వదించాలని,వేలాదిమందిగా తరలిరావాలని వైయస్ఆర్సీపీ రాష్ట్రకార్యదర్శిపెరికెవరప్రసాదరావు పిలుపునిచ్చారు. కరోనా టైంలో ఉపముఖ్యమంత్రిగా ఆళ్లనానిఎంతోసేవా కార్యక్రమాలు చేశారని,ప్రజలను కోవిడ్ భారీ పడకుండా అప్రమత్తం చేశారని తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఆళ్ల నానిని,ఏలూరు పార్లమెంట్ సభ్యులు కారుమూరి సునీల్‌ని గెలిపించాలని కోరుతూ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీసెల్ అధ్యక్షులు గంటా ప్రసాద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి,ముఖ్యమంత్రి ఆళ్ల నాని,బీసీలకు అత్యధికంగా సీట్లు కేటాయించారని తెలిపారు. బీసీ నాయకులు పివి రావు మాట్లాడుతూ జనహృదయనేత ఆళ్ల నాని అని కొనియాడారు. లిఫ్ట్ క్యాప్ డైరెక్టర్ సొంగ సందీప్ మాట్లాడుతూ ఎస్సీలకు మాల,మాదిగ రెల్లి కులస్తులకు కార్పొరేషన్ చైర్మన్ చేసిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డి దేనని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు సిహెచ్ మంగరాజు, వైయస్సార్సీపి జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానరాజు పాల్గొన్నారు.

# వేణుగోపాలస్వామి సన్నిధిలో డిప్యూటీ సీఎం 'కొట్టు', మాజీ ఎమ్మెల్యే ఈలినాని



**పెంటపాడు,మేజర్‌న్యూస్:**పెంటపాడు మండలం కస్పా పెంటపాడు గ్రామంలో బైరాగి మఠంలో జరుగుతున్న శ్రీరామనవమి వేడుకల్లో డిప్యూటీ సీఎం, కొట్టు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని కలుసుకున్నారు. సీతారాములవారి కళ్యాణ మహోత్సవంలో వీరిరువురు పాల్గొన్నారు. మంత్రి కొట్టు అక్కడకు చేరుకునే సమయానికి ఈలి నాని కళ్యాణాన్ని వీక్షిస్తూ ముందువరుసలో కూర్చున్నారు. మంత్రి కొట్టు సీతారాముల వారిని దర్శించుకుని కళ్యాణాన్ని వీక్షించేందుకు నాని పక్కనే కూర్చున్నారు. గతంలో వీరిరువురు ఇదే దేవాలయంలో పూజలు చేస్తున్న సందర్భంలో శాసనసభ్యులుగా ఉన్న పొట్టి సత్యనారాయణకు ఉపముఖ్యమంత్రి పదవి తనను వరించినట్లుగాసమాచారం వచ్చింది. ఆ సెంటిమెంట్ ఆధారంగా ఇక్కడజరిగే పూజారి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నేడు సీతారాముల కళ్యాణం జరుగుతున్న ఈ సందర్భంగా వీరిరువురు మాట్లాడుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఈలి నాని ఇటీవల వైయస్సార్సీపీ లో చేరిన సంగతి తెలిసిందే. వీరిరువురి కలయిక ఆసక్తిని రేకెత్తించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న ఈలి నాని ఇప్పటివరకు ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు. రానున్న రోజుల్లో నాని ప్రచారంలో పాల్గొని అధికార పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తారేమో వేచి చూడవలసిన ఉంది.

# ఇంటర్ లో విద్యార్థి కొవ్వూరు లోకేష్ రెడ్డి ప్రతిభ



**పెనుమంట్ర, మేజర్‌న్యూస్ :** మార్టేరు పుంతవీధికు చెందిన కొవ్వూరి లోకేష్ రెడ్డి ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో 470 కు 464 మార్కులు సాధించారు. కొవ్వూరి లోకేష్ రెడ్డి తల్లిదండ్రులు కొవ్వూరి ధర్మా రెడ్డి, కొవ్వూరి గాయత్రి కి భీమవరం ఎస్ ఆర్ కె కాలేజ్ యాజమాన్యం కు ప్రతేక అభినందనలు తెలియజేసిన మార్టేరు వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాడెంట్ గుడిమెట్ల రామ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు లోకేష్ రెడ్డి మా స్కూల్‌లో టెన్త్ ఫలితాలులో కూడ ఫస్ట్ ర్యాంక్ సాదించాడు అని అలాగే ఈరోజు ఇంటర్ ఫలితాలు లో ఎస్ ఆర్‌కె కాలేజీలో కాలేజ్ ఫస్ట్ వచ్చాడు అని అన్నారు.ఈ సందర్భంగా లోకేష్ కి ప్రతేకంగా అభినందనలు తెలిపారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలపై బుధవారం అమీనా పేట లో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయము వద్ద గల ఆంజనేయ స్వామి వారి దేవాలయం వద్ద 89 వ సీతారాముల కళ్యాణ మహోత్సవంను ఏ.అర్ అదనపు ఎస్పీ ఎన్.ఎస్.ఎస్.శేఖర్ సతీ సమేతంగా గా హాజరై ముత్యాల పందిరిలో మంగళ సూత్ర ధారణ ముత్యాల తలంబ్రాలు అంగరంగ వైభవంగా పోలీస్ కుటుంబాలు,ప్రజల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు పవన్ కుమార్ ఏ.అర్.అర్.ఐ పర్యవేక్షణలో కమిటీ అధ్యక్షుడు ఆర్ఎస్ఐ భాస్కర రావు,ఎఆర్ఎస్ఐ పి.రవీంద్ర,హెచ్‌సి ఎల్.రాంబాబు,హెచ్‌సి కె.ఎస్.ఎన్.మూర్తి,హెచ్‌సి వి.కె.దుర్గారావు,హెచ్‌సి ఎ.అప్పాజీ,పిసి పి.దుర్గా ప్రసాద్ పిసి ఓ.శ్రీనివాస్,హెచ్‌సి డి.డి.ప్రసాద రావు,హెచ్‌సి వి.శ్రీనివాస్ రెడ్డి,పిసి పి.వి రమణ రావు,పిసి కె.కె.కిషోర్ కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.అర్ డిఎస్పీ శ్రీహరి రావు,ఎస్.బి ఇన్స్పెక్టర్ బి.అది ప్రసాద్, ఏలూరు 3 టౌన్ ఇన్స్పెక్టర్ వి.వేంకటేశ్వర రావు,ఏ.అర్.అర్.ఐ కృష్ణంరాజు మహోత్సవంలో పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారు



**పెనుమంట్ర,మేజర్‌న్యూస్** :రాష్ట్రంలో ముస్లీంల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెంలో నిర్వహించిన మైనార్టీల సమావేశంలో పాల్గొన్నారు. డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి కాలం నుంచి ముస్లీంల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నారన్నారు. నాడు 5 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్ కుటుంభానిదేనన్నారు. నేడు ముస్లీంలకు సీఎం జగన్ ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లోనూ అధిక సీట్లు కేటాయించి వారికి సమ ప్రాధాన్యత కల్పించారన్నారు.

చంద్రబాబు ముస్లీంలను వాడుకొని వదలివేసారన్నారు. అరకొరగా వారికిపదవులుకట్టబెడుతూమభ్యపెట్టారన్నారు.చంద్రబాబు మోసపూరిత మాటలకు మోస పోవద్దన్నారు. ముస్లీంలకు ఆచంట నియోజకవర్గంలోనూ తగు ప్రాధాన్యత నివ్వడం జరిగిందన్నారు. ముస్లీంలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు, ప్రతీ ఒక్కరూ సీఎం జగన్ విజయం కోసంపాటు పడాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్‌రాజు, పెనుగొండ ఎంపీపీ పూతీనిడి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, పిల్లి నాగన్న, జక్కంశెట్టి చంటి,పలివెల శ్రీను, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీను,డైరక్టరు బొక్కా అరుణ, పార్టీ నాయకులు కేశరపల్లి రమేష్, కలగట సాగర్, పులిదిండి వెంకటేశ్వరరావు, చిన్నం రామిరెడ్డి, వేంద్ర వెంకటేశ్వర్లు, అయ్యప్ప రెడ్డి, బ్రహ్మారెడ్డి, నాగరాజు, సుధీర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# వాసవిలో అంగరంగ వైభవంగా సీతారాముల వారి కళ్యాణం



**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన సంఘం గౌరవాధ్యక్షుడు కోన హనుమాన్ దేవాలయానికి విచ్చేసి సీతారాముల కళ్యాణం లో పాల్గొన్నారు. శ్రీ ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొల్లేపర పెద్దిరాజు గుప్తా బ్రదర్స్ దంపతులు పీటలపై కూర్చుంటే పూజా అధికారి కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొంపెల్ల రామం, ప్రభాకర్ శర్మ ల నేతృత్వంలో జరిగిన సీతారాముల కళ్యాణం లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం సుమారు వెయ్యి మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది. శ్రీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొల్లేపర రాము, కార్యదర్శి నన్నా సుందర్రావు, కోశాధికారి బోగవల్లి రమేష్, వాసవి క్లబ్ అధ్యక్షులు నున్న ఆనంద్ ఆలయ కార్యదర్శులు ఆలపాటి సత్యనారాయణ, ఆలపాటి చిన్న శ్యామ్ పులవర్తి పవన్, రాంపండు తదితరుల పర్యవేక్షణలో అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని పానకం వడపప్పులు, కర్బూజా జ్యూస్ లు భక్తుల కోసం ఏర్పాటు చేశారు. వాడవాడలా సీతారాముల కళ్యాణాలు జరుగుతున్నప్పటికిని పెద్ద సంఖ్యలో వాసవి మాత ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ముత్యాల తలంబ్రాలు కమిటీ వారు అందించగా పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములకు చదివింపుల రూపంలో వెండి బంగారు పూలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, మారం వెంకటేశ్వర్లు, వబిలి శెట్టి నటరాజు పలువురు ముఖ్య వక్తలు కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడారు. సాయంత్రం ఏడు గంటలకు సీతారాములకు పవళింపు సేవ అనంతరం పలహారము కమిటీ వారు ఏర్పాటు చేశారు. శ్రీ ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్ వరితా క్లబ్ ఆర్యవైశ్య మహిళా సంఘం ప్రపంచ ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేడు ఏలూరు మండలంలో పలు ప్రాంతాలలో విద్యుత్ కట్

ఏలూరు,మేజర్‌న్యూస్: ఏలూరు మండలము ఏలూరు డి4 సెక్షన్‌లో పరిదిలో ఉన్న చాటపర్రు, గుడివాక లంక,33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల నిమిత్తము 19/4/2024 శుక్రవారం నాడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు చాటపర్రు,చాటపర్రురోడ్, తిమ్మరావుగూడెం, కే.డి.పురం, గుడివాకలంక, మొండికోడు,ప్రత్తికోల్లలంక,పైడిచింతలపాడు, కొక్కిరాయిలంక, కోమటిలంక, పెద్దయాగిరిపల్లి,చిన్న యాగిరిపల్లి,గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈ ఈ) జే.పి.బి. నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# ఎవరన్నా ఎదురు తిరిగితే అంతే?

**-గత 5 సంవత్సరాలుగా జరుగుతున్న తంతు ఇదే**

**-ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి,మాజీ మంత్రి కామినేని ఆవేదన**



**కైకలూరు,మేజర్ న్యూస్ :** ఎన్డీఏ కూటమి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాలలో గౌడ సంఘం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ నేను ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేసిన కాలంలో నా కుటుంబ సభ్యులు రాజకీయంతో సంబంధం లేకుండా ఉండేవారు. కానీ ఈ 5 సంవత్సరాల పాలనలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పరిపాలన కొనసాగించారు. వారు చెప్పిందే వేదం లేదంటే వారికి కష్టాలే అన్న సంఘటనలు 4 మండలాల్లో చోటు చేసుకున్నాయని తెలిపారు. ఉదాహరణకు నిషేధిత క్యాట్ ఫిష్ అమ్మకాల్లో జరిపిన లావాదేవీల్లో కోట్లాది రూపాయలు సంపాదించుకున్నారన్నారు. 2014 ఎన్నికల్లో దూలం నాగేశ్వరరావుకి టికెట్ ఇవ్వకుండా ..గౌడ కులానికి చెందిన ఉప్పల రాంప్రసాద్‌కు కైకలూరు వైసిపి టిక్కెట్టు కేటాయించారు. కానీ ఆ ఎన్నికల సమయంలో ఉప్పాల రాంప్రసాద్ కు దూలం వెన్నుపోటు పొడిచాడని దీనిపై నేను ఏ గుడిలోనైనా ప్రమాణం చేస్తానని ఉప్పాల రాంప్రసాద్ సవాలు విసిరారు. ఈ విషయం నియోజకవర్గంలో ప్రజల ందరికీ తెలుసునని కామినేని అన్నారు. అంతేకాకుండా జగనన్న ఇంటి స్థలాల మట్టి మాఫియా ఎవరన్నా ప్రశ్నిస్తే అంతే సంగతులు ? గత టిడిపి ప్రభుత్వం హయాంలో నేను చేపల,రొయ్యలు చెరువుల తవ్వడానికిఅందరికీ స్వచ్ఛందంగా అనుమతి ఇచ్చాను. కానీ ఇప్పుడు చెరువులు తవ్వాలంటే ఇక్కడ నాయకుడికి డబ్బులు కట్టాలి ? అని కామినేని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం లోని నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్**



**ఏలూరు,మేజర్‌న్యూస్:** మే13న జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని,మతోన్మాద బిజెపి దానికి తొత్తుగా వ్యవహరిస్తున్న రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలను ఓడించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఏలూరు అసెంబ్లీ ఇండియా కూటమి అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ సిపిఐ, సిపిఎం కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ప్రచార సభలో ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా విస్మరించిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బిజెపి దానికి మద్దిస్తున్న పార్టీలను ప్రజలు వ్యతిరేకించాలని ఇండియా కూటమి పార్టీలను గెలిపించాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమాలకు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఎం జిల్లా నాయకులు బి సోమయ్య, నగర కార్యదర్శి పి కిషోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి కన్నబాబు, ఉండేటి బేబి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, ఉపాధ్యక్షురాలు మావూరి విజయ, గొర్లి స్వాతి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డాంగే తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్లు దాఖలు చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు

**ఏలూరు,మేజర్‌న్యూస్:** అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకురాలి.

పార్లమెంటుకు పోటీచేసే అభ్యర్థులు ఫారమ్ 2ఏ, అసెంబ్లీకి పోటీ చేసేవారు ఫారమ్ 2బిలో దరఖాస్తు చేయాలి. నోటిఫైడ్ తేదీలలో ఉదయం 11.00 నుండి మధ్యాహ్నం 3.00 వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. పబ్లిక్ సెలవు దినాలలో నామినేషన్ స్వీకరించబడదు. అభ్యర్థులు గరిష్టంగా 4 సెట్ల నామినేషన్ దాఖలు చేయవచ్చు. నామినేషన్లను ఆర్‌ఓకు గానీ, సంబంధిత ఏఆర్‌ఓకు మాత్రమే సమర్పించాలి. అభ్యర్ది తన నామినేషన్‌ను నేరుగా గానీ, తన ప్రపోజర్ ద్వారా గానీ సమర్పించవచ్చు. అభ్యర్థి నామినేషన్‌తో పాటు తమ పేరిట కొత్తగా తెరిచిన బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాలి. 2 కంటే ఎక్కువ నియోజకవర్గాల నుండి అభ్యర్థులు నామినేషన్లను ఫైల్ చేయడం కుదరదు. నామినేషన్ల దాఖలు సమయంలో 100 మీటర్ల పరిధిలో గరిష్టంగా 3 వాహనాలు అనుమతించబడతాయి. అభ్యర్థితో సహా ఐదుగురు వ్యక్తులు మాత్రమే ఆర్‌ఓ ఆఫీస్‌లోకి ప్రవేశించవచ్చు.నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశారు. సువిధ యాప్ ద్వారా నామినేషన్లను దాఖలు చేసే అవకాశం ఉన్నప్పటికీ, వాటి కాపీలను భౌతికంగా ఆర్‌ఓకు అందజేయాల్సి ఉంటుంది.ఫారమ్-26 ద్వారా తన అఫడవిట్‌ను సమర్పించాలి. ఫారమ్ 26 స్టాంప్ పేపర్ విలువ రూ. 10 లేదా అంతకంటే ఎక్కువ ఉండాలి. భౌతిక స్టాంప్ పేపర్ అందుబాటులో లేకుంటే ఈ స్టాంప్ ఉపయోగించవచ్చు. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచీ, ఖర్చు అతని ఖాతాలో లెక్కించడం జరుగుతుంది. పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ వార్తలను సైతం అభ్యర్థి ఖాతాలో లెక్కించడం జరుగుతుంది.

**ఎన్నికల ప్రక్రియ షెడ్యూలు,ముఖ్యమైన తేదీలు:**

-గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసే తేదీ: 18 ఏప్రిల్ 2024 (గురువారం)-గెజిట్ నోటిఫికేషన్ జారీ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది.-నామినేషన్లు వేయడానికి చివరి తేదీ : 25 ఏప్రిల్ 2024 (గురువారం)-నామినేషన్ల పరిశీలన తేదీ: 26 ఏప్రిల్ 2024 (శుక్రవారం)-అభ్యర్థుల ఉపసంహరణకు చివరి తేదీ: 29 ఏప్రిల్ 2024 (సోమవారం)-పోల్ తేదీ: 13 మే 2024 (సోమవారం)-కౌంటింగ్ తేదీ : 04 జూన్ 2024 (మంగళవారం) -ఎన్నికలు ముగిసేలోపు తేదీ : 06 జూన్ 2024 (గురువారం)